# 11
# పిచ్చితుమ్మ

తప్పే అయినా, ఒప్పే అయినా దాన్నికాస్తా విమర్శ చేసి చర్చించు కోడానికి మనిషి లేకపోవడం ఎంత బాధ... ఎంత దీనమైన స్థితి... అలాగని ఎంతసేపు నామీద నేనే జాలిపడుతూ కూర్చోను?

సుజాత

'ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరు...

విధివిధానమును తప్పించుటకై ఎవరు సాహసించెదరూ...'

గుడివెనుక పక్క తలదాచుకున్న ఫకీ రొకడు తత్వాలతోపాటు సినిమాపాట నొక దాన్ని వల్లెవేసుకుంటున్నాడు.

రాత్రంతా మధనపడిపడీ అప్పుడే అర కన్ను మూశానేమో దిగ్గునలేచి కూర్చున్నాను. కళ్ళు పొడుస్తున్న లేత సూర్యుణ్ణి చూడ్డానికి ఇష్టంలేక గబుక్కున మోకాళ్ళలో తల దాచు కున్నాను.

వద్దువద్దని ఎంత రావద్దనుకున్నా ఈ ఉదయం రానే వచ్చింది.

నా ఒళ్ళంతా గుబగుబ చెమటలు పట్టి గుండె వేగంగా కొట్టుకుంటోంది. తీవ్ర ఉద్వే గంతో అరిచేతులు అరికాళ్ళూ ఒణుకు తున్నాయి.

మెల్లిమెల్లిగా తన కిరణాలను పరుచుకుంటూ భూగోళపు ఆవలివైపు నుండి తొంగితొంగి చూస్తున్నాడు సర్వసాక్షి. అవును అన్నింటికీ అతడే సాక్షి. ఈ ప్రపంచంలో జరిగే అన్ని విషయాలకూ సాక్షి... సాక్షీభూతం... భూతం...

ఏ భూతం ఆవహించిందో నన్నారోజు...

ఏ శని నెత్తికెక్కి ఆడించిందో నన్ను?

ఏం మునించిందో నాకు?

మళ్ళీ ఒక్కసారి ఆ క్షణం తిరిగొస్తే నేనలా చేయకపోదును.

అట్లా మాట్లాడను. అట్లా మాట్లాడ్డమనేది ఇప్పటికిప్పుడు నా నోట్లానుండి వచ్చిందా? చిన్నప్పట్నుండీ నాయనమ్మ ఆమె ద్వారా అమ్మ నాకు నేర్పిన అంట్లు సొంట్లలో నుండి , నా చుట్టూ వున్న కుటుంబాల నుండి నేను నేర్చుకున్న మాటలే కదా...

దిక్కుతోచని స్థితిలో అనాలోచితంగా ఎడమ అరిచేత్తో తలబాదుకున్నాన్నేను. మూడు నెలలనుండీ యెన్నోసార్లు నేనీపని చేస్తూనే వున్నాను. నిజంగానే పశ్చాత్తాపమో లేక ఆ తరువాత జరిగిన అనేక పరిణామాల దృష్ట్యా ఏర్పడిన అనుతాపమో అర్థం కాకుండానే...

అయితే మాత్రం నేను వాళ్ళడిగినట్లు చేస్తానా? ఎందుకు చెయ్యాలసలు. కోర్టు చుట్టూ తిరగనైనా తిరగతానుగాని వాళ్ళకి వంటచేసి వడ్డించి ఆకులెత్తతానా? గుండెల్లో మంట రేగుతోంది.

'యాడైనా దూకి సస్తే బాగుణ్ణు,' అన్పించింది.

చావడానికైనా బాయిలో చుక్కనీళ్ళు లేవు. పైకెక్కి దూకదామంటే మిద్దిలేదు. కల్యాణకూటపు పెంకుటిల్లు.

'ఊరికంతా మొదటిల్లు... సుఖపడిపోతావు'

'అట్టాటాయన కోడలనిపించుకుంటే చాలు,' అంటూ నాయిన నా గొంతు కోశాడు.

పేరుంటే చాలా?

ఒక మంచా?... ఒక చెడ్డా?

కడుపు కింత తిండి తినడం తప్ప నేనేం సుఖపడ్డానీ యింట్లో?

డబ్బుండాల సుఖంగా బతకడానికి... ఆడబ్బే వుండుంటే ఈరోజు వాళ్ళు కేసు పెట్టుకున్నా తను జంకి వుండేదా? వేలు పెట్టుకోపొండ్రా అని నిర్లక్షంగా వుండి వుండే దాన్ని.

ఇవన్నీ ఏమీ లేకపోయినా కొంచెం ఇంగితముండాల కోడల్ని సమర్థించి కాపాడు కోడానికి.

ఛూ...

మావగార్ని ఎన్నిసార్లు తిట్టుకున్నా నాకు తృప్తి కలగడంలేదు.

పదోతరగతి పరీక్షలు రాసీరాయక ముందే పెళ్ళిపెళ్ళంటూ వెంటబడ్డ నాయి నమ్మనీ, అత్తా , మొగుడు మాటలకి ఏ మాత్రం అడ్డం చెప్పకుండా పనిచేసుకుపోయే మా అమ్మనీ, నా తరువాత వరుసగా పుట్టుకొచ్చిన ముగ్గురు చెల్లెళ్ళనీ అందరినీ తిట్టు కున్నాను. అందరి మీదా నాకు విసుగ్గావుంది. నామీద నాకే చెప్పలేనంత చిరాకు.

ఇంత ఆపద సమయంలో కూడా నాకు తోడుగా ఎవ్వరూ రానందుకు ఉద్వే గంతో మోకాళ్ళలో తలదూర్చుకుని ఏడ్చాను .

తెల్లారిపోయిన విషయాన్ని ఆదమరచి నిద్రపోయినట్లుగా గుడ్లగూబ ఒకటి వికృతంగా అరుచుకుంటూ వెళ్తోంది. నేను కూడా తేరుకున్నట్లుగాతలెత్తి ఉలిక్కిపడ్డాను.

పెద్దమనిషి... పెద్దమనిషని అంతా గొప్పగా చెప్పుకొనే ఈ మనిషి, ఉదయం లేస్తే ఊరంతటికీ తీర్పులు తీర్చే మనిషి ఇట్టాటి తీర్పుకి తలొంచుకోని వస్తాడా?... అంతేలే మన బంగారం మంచిదైతే కంసాలోడేంచేస్తాడని... ముందు ఈయనకుండాల... నోరు మూసుకుని నాయనెట్ట చెబ్తే అట్ట చేసేదే. ఏరోజైనా తండ్రి మాటకు ఎదురు చెప్తాడా?

ఆఖరికి ఇటువంటి రోజు కూడా తండ్రి చెప్పిందే కరెక్టని వాదిస్తుండాడు. మహా మహా తప్పులు చేసిన పెళ్ళాల్నే అక్కున చేర్చుకుంటుండారు మొగుళ్ళు. ఇదంతా నా ఖర్మ. భర్తకైనా జాలిలేకపాయె నామీద... పైపెచ్చు నాదే తప్పని నిందేస్తుంటిరి... అవు నవును అంతా తప్పే... నాదే తప్పు... ఆయన చేతకానితనాన్నే, మొగుణ్ణి అదుపులో పెట్టుకోలేని నా చేతగానితనాన్నే తిట్టుకుంటూ లేచి పక్కగుడ్డలన్నీ సర్దిపెట్టాను.

ఇట్టాటి రోజున కూడా ఇది మంచేమి, చెడ్డేమి, పరిస్థితేంది అని ఆలోచించ కుండా, అసలేమీ పట్టనట్టుగా తెల్లారకముందే పొలంకాడి కెళ్ళిపోయాడు. ఇట్ట తప్పించు కుని తిరిగేవాళ్ళు అసలు పెళ్ళిళ్ళు చేసుకోకూడదు. గొంతుదాకా నిండిన కోపాన్ని గొంతు లోనే దిగమింగుతూ పెరట్లోకి వెళ్ళాను.

ఎక్కడికెళ్ళినా నా ఆలోచనలు మాత్రం నన్ను వదలడంలేదు.

మా పెరట్లో అరబూసిన పున్నాగపూల సువాసనగానీ, మంచుతో నిండి మరింత తెల్లబడ్డ నందివర్ధనాల ముద్ద సౌందర్యంగానీ నన్ను తాకలేదు. ప్రతిరోజూ ఉదయాన్నే దేవుడికి పువ్వులు కోయడమనేది నాకెంతో ఇష్టమైన పని. ఐతే అదికూడా చెయ్యాలని పించలేదు.

అనాలోచితంగా ఏ వరండాలో అయితే నేనాపని చేశానో అక్కడికి వెళ్ళ బోయాను.

అప్పటికే ఏ తెల్లారురఝామున నిద్రలేచాడోగానీ చీకటిదెయ్యం మాదిరి కుర్చీలో వెనక్కివాలి కూర్చుని వున్నాడు ముసలోడు.

ఆ మూసిన కనురెప్పల వెనక ఏముందో, ఆ తలలో ఎన్ని ఆలోచనలు తిరుగు తున్నాయో అర్థంకాకుండా వుంది నాకు.

ఈమధ్యకాలంలో ఎప్పుడూ లేనంతగా కాకులగుంపు రొదపెడుతోంది. ఈ ఊళ్ళో ఎప్పుడూ అంతే మనుషుల్ని నిద్రలేపడానికి కోళ్ళు కాకుండా కాకులొస్తాయి.

అంతకంతకీ ఎక్కువౌతోన్న కాకుల రొద నా మనసుని మరింత అల్లకల్లోలం చేస్తోంది. దాన్ని మర్చిపోడానికి చిరాకుతో విసవిసా లోపలికి నడిచాన్నేను.

అప్పటికే ముందు వాకిలంతా చిమ్మి ముగ్గులు తీర్చిన రంగమ్మ పెరట్లోని చెత్తనంతా బరబరా ఊడ్చేస్తోంది. పోలయ్య గాడిపొయ్యి వద్ద శుభ్రం చేస్తున్నాడు. అత్తగారు చనిపోయి నేనొచ్చాక ఈ మాలసంతనంతా ఇంట్లోకి రానీకుండా కట్టడి చేసే శాను. అయినా కడుపాత్రం పట్టలేక పనిమానుకోలేదు వాళ్ళిద్దరూ. ఇప్పుడు బయటి పనే చేసుకుంటుండారు. ఈరోజు ఏం జరగబోతోందాని ఆత్రుతగా ఉన్నట్టున్నారు. తెల్లవారురఝాము మసక వెలుతురులో మాటా పలుకూ లేకుండా తమ పని తాము చేసుకుపోతూన్న ఆ మొగుడూ పెళ్ళాలిద్దరూ ఏదో కాగితంమీద వేసిన పెయింట్ బొమ్మల్లా వున్నారు.

గాడిపొయ్యి తవ్వుతోన్న పోలయ్యనీ, అదేం పట్టకుండా బరబరా చిమ్ముకు పోతోన్న రంగమ్మనీ చూస్తుంటే కుతకుతా ఉడికిపోయింది నాకు. అంటే వీళ్ళ వుద్దేశ్య మేమిటి?

నేనా గుంపుకంతా వంట చేయాలనేనా?

చెయ్యాల్సిందేనా?... చెయ్యకుండా వీలవుతుందా?...

చేయక చస్తానా ?... చావడానికైనా దారిలేదు కదా...

పెద్దమనుషులు... పంచాయితీలోని పెద్దమనుషుల తీర్పుకదా. భలే బాగా తీర్చినారు తీర్పు. ఉక్రోషంతో నా చేతి వేళ్ళు మెటికలు విరిగాయి. నాకు చెప్పుకోడానికి ఎవరూ లేరు. నా మనసు పంచుకోడానికిక్కడ మనిషే లేడు.

తప్పే అయినా, ఒప్పే అయినా దాన్నికాస్త విమర్శ చేసి చర్చించుకోడానికి మనిషి లేకపోవడం ఎంత బాధ... ఎంత దీనమైన స్థితి... అలాగని ఎంతసేపు నామీద నేనే జాలిపడుతూ కూర్చోను?

పనిని ఏ వైపునుండి మొదలుపెట్టాలో, ఎలా ప్రారంభించాలో, అసలు మొదలు పెట్టాలా, వద్దా అని ఆలోచిస్తూ స్నానాలగదిలోకి వెళ్ళాన్నేను. అప్పటికి కాకులరొద కొంత తగ్గి పూర్తిగా వెలుతురు పరుచుకుంటోంది.

✦ ✦ ✦

సుధాకర్

"నేను మనిషిననిపించే భాగమేదో నాలో ఇప్పటిదాకా లెక్కలేనన్నిసార్లు చచ్చి పోయింది. ఎవరి దృష్టిలోకూడా నేను మనిషిని కాదు..."

జీవితం చివరిపేజీ కంటా నిండిపోయిన దుఃఖాన్ని పేజీపేజీగా చదువుతూ... మధ్యమధ్యలో వెనక్కి తిప్పుతూ, కొన్ని పేజీలు చింపేస్తూ... దు ఖిస్తూ... సంతోషాన్ని నటిస్తూ... నాకు నేనే నచ్చచెప్పుకుంటూ...

నా కుడి అరచేయి గట్టిగా బిగుసుకుంది.

పుస్తకాన్ని పక్కన పడేసి లేచి వాకిట్లో అటూయిటూ తిరుగుతూ ఆలోచనలో పడ్డాన్నేను.

నాయిన, చిన్నాయిన, ఎదురింటి పుల్లమామ, పక్కింటి రాగన్న, శీనయ్య, వెంకటేశ్వర్లు- వీళ్ళందరిలోనూ మనిషనే భాగమేదో నిజంగనే చచ్చిపోయినట్టుంది. ల్యాకుంటే వీళ్ళంతా అంత ఒదిగొదిగీ వుండాల్సిన అవసరం లేదు.

తాము చేసిన పనికి కూలిడబ్బులడగడానిక్కూడ అంత వొణుకేంది?

మమ్మల్నంతా మనుషులుగా చూడ్డానికడ్డంపడే నలుపు, మా యింటి ఆడవాళ్ళని చూసి తెగులుపడేటప్పుడు అస్సలంటదు... మాయింటి ఆడకూతుళ్ళేనాడూ వాళ్ళకి సంసారుల్లా కన్పడరు.

అప్పుడప్పుడూ నాకన్పిస్తుంటుంది.

మా శరీరాల్లో నిజంగా సిరలూ, ధమనులూ వున్నాయా?... వుంటే అందులో ఎరుపు నెత్తురే పారుతోందా? నలుపుదా? చిన్ననాటి నుండీ జరిగిపోయిన అనేకానేక అవమానాలు నన్నీరాత్రి చుట్టుముట్టి నిలవనివ్వడంలేదు.

ఇంచుమించుగా నా వయసేవున్న పెద్దిరెడ్డిగారి మనవడ్ని నా వీపుమీది కెక్కించు కుని గుర్రమాట ఆడిన సంగతి గుర్తుంది. అయితే ఆ ఆటలో ఎప్పుడూ నేనే గుర్రమెందు కయ్యే వాడ్నో అప్పట్లో నాకు తెలిసేదికాదు.

నేను బళ్ళో కెళితే, 'నీ కెందుకూ చదువులంటూ,' నీరుగార్చిన అయ్యవార్లూ, చదువుకుంటానని అడిగినందుకు చావగొట్టి చెవులు మూసిన మా నాయినా...

అకారణంగా మరణించి, శవపంచాయితీలో పాముకాటు మరణంగా మారిన మా తాత శవం... నాకింకా చాలాచాలానే గుర్తున్నాయి.

ఇదే రంగారెడ్డి తమ్ముడి మూలంగా పధ్నాలుగేళ్ళ వయసులో పెద్దక్క కాలిపోయిన గుడిసెకింద బూడిదై రేగడం గుర్తుంది. అక్క మరణాన్ని కళ్ళారాచూసి పిచ్చిపట్టి తిరుగుతూ ఊరంతటికీ పెళ్ళామైపోయిన చిన్నక్క గుర్తుంది. ఇదే రంగారెడ్డి తండ్రివద్ద జీవితకాలం అటాకి చాకిరీ చేసిన తాత డబ్బులడిగినందుకే చచ్చిపోయాడని ఊరంతా చెప్పుకునేవారు.

మరణించిన ప్రతి నవ్వు వెనకా చీకటే... పుట్టిన రెండుమూడు శతాబ్దాల తరవాత కూడా చీకటి... చీకటే చీకటి... అంతా చీకటి... కటిక చీకటి...

వొంటినిండా కప్పుకోడానికి గుడ్డలేకుండా, యాచించి యాచించి నన్ను పెంచిన నా తల్లి...

ఇవ్వాల్టికీ పెద్ద రెడ్ల కొట్టాల్లో పశువుల కాళ్ళ కింది పేడలో చెమటని పోసి పిసుకుతూ మరుగుజ్జయి మగ్గిపోతోన్న తండ్రి... డ్రైవరుపని నేర్చుకుని కూడా వంగి వంగి దండాలు పెడుతూ తలుపులు తీసే పెదనాయన కొడుకు శీనయ్య...

వాళ్ళ ఇళ్ళన్నీ చిమ్మీ, తుడిచీ, అంట్లుతోమీ, గుడ్డలుతికీ చేతులరిగిపోయిన మా ఆడపడుచులూ... అధవా తప్పీ దారీ చదువుకోసం హాస్టళ్ళలో చేరిన ఆడపిల్లల హఠాన్మరణాలూ... అన్నీ తెలుసు నాకు.

అన్నీ ఇప్పుడిప్పుడే జరిగినట్లుగా గుర్తున్నాయి...

ఇంకా యింకా జరుగుతూనే వున్నాయి...

అనుభవాలకేం కొదవ?... తలచుకుంటూపోతే బుర్ర పట్టనన్ని అవమానాల వెల్లువ...

అయితే వీళ్ళందరిలోనూ చచ్చిపోయిన మనిషన్న భాగం నాలో మాత్రమే ఎందుకు చచ్చిపోలేదో అర్థంకాని వాస్తవం...

చదువు కాస్త వంటబట్టి ఉద్యోగం వెలగబెడుతున్నందువల్ల నా భాషకి వాళ్ళ వాసనలబ్బినప్పటికీ, కాళ్ళు మాత్రం ఇంకా మట్టిలోనే వున్నాయి.

రంగారెడ్డి కోడలైతే ఎవరికి గొప్ప?

మాటతూలితే ఎంతటివాళ్ళైనా ఒకటే... మా తాతలాగా, తండ్రిలాగా వణికి చేతులు కట్టుకుని నేను వాళ్ళముందు నిలబడలేను... ఎంత మాటన్నదామె?

ఈ మాలవెధవల్నంతా మంచాల మీద కూర్చోబెట్టి మాట్లాడుతున్నందుకు మొగుడ్ని తిట్టిపోస్తూ మంచమూ, వరండా, ఇల్లూ అన్నీ కడిగి కడిగి శుభ్రం చేసింది. నేను కులాన్ని మరిచిపోయి మంచంమీద కూర్చున్నందుకు దుమ్మెత్తిపోసింది. ఇట్టాటి పోరంబోకుగాళ్ళకంతా ఉద్యోగాలిచ్చి జనాభా లెక్కలు వ్రాయమని పంపించినందుకు ప్రభుత్వాన్ని దుయ్యబట్టింది. ఆవు పంచితాన్ని తెచ్చి ఇల్లంతా చల్లింది.

నేనా మంచం మీద మర్చిపోయిన పెన్ను కోసం తిరిగి వెళ్ళకుండా వున్నట్టయితే ఇంకా ఇంకా అనేదే...

సీసం నిండిపోయిన నా చెవులెలా పనిచేశాయో? నాకంత ఆవేశమెట్లా వచ్చిందో? నేను నిజంగా మాలవెధవనికానా?

మాల, మాదిగ అయితే అయ్యుండొచ్చును కానీ వెధవని మాత్రం కాను.

'మంచి అన్నది మాల అయితే మాలనేనగుదున్' అన్నాడా మహానుభావుడు.

ఒకవైపు ఊళ్ళలోని పెద్దకుటుంబాల వాళ్ళు వాడమనుషుల్ని అస్పృశ్యులుగా చూస్తుంటే, మరోవైపు ప్రభుత్వం కూడా మమ్మల్ని చిన్నచూపు చూస్తోంది. చెప్పులు కుట్టి, డప్పులు కొట్టి, సేవలు చేసి, బానిస బ్రతుకులు బతికే మేము విద్యా ఉద్యోగ, సంక్షేమ, రాజకీయరంగాల్లో వాటా కావాలని కోరడం అన్యాయమా? కనీస హక్కులు కోరితే నేరమా?

నేను నిల్చున్న నేల, నేను కూర్చున్న మంచం, నేను తాకిన కలం ఇవన్నీ ఎందుకు మైలపడుతున్నాయి... మైలంటే ఏమిటి?

నేను రెండుపూటలా స్నానం చేస్తాను. నీళ్ళున్నా లేకున్నా రోజూ ఉతికిన గుడ్డలే వేసుకుంటాను.

ఈ మైల ఎక్కడ్నుండొచ్చి ఎలా అంటుకుంది? నా నలుపులోనుండా? ఊరి బయటనున్న ఈ వాడలోనుండా?

'మాలమాదిగ వెధవలు,' అన్న మాటని ఊరి పంచాయితీ ముందుకీ... పెద్ద మనుషుల ముందుకీ తీసుకెళ్ళాన్నేను. అక్కడితో ఆగక పక్క ఊరి పంచాయతీలో కూడా పెట్టాను. ఇంకా అవసరమైతే పోలీస్టేషనుకు, కోర్టుకు ఎంతెంత దూరమైనా వెళ్దామనే అనుకున్నాను. వెళ్ళడానికి సిద్ధపడ్డాను కూడా...

నాకంత ధైర్యమెట్లా వచ్చింది?

జన్మజన్మాంతరాల నుండీ ఇన్ని అవమానాలూ, బాధలూ మోస్తూ వచ్చినవాణ్ణి... వాళ్ళ ఆదేశాల కోసం సదా తలవంచినవాడ్ని యిప్పుడెందుకింత ఆగ్రహపడ్డట్టు?... యిప్పుడెందుకింత కావేష పడినట్టు? ఇదంతా కేవలం శ్యామ్ అంకుల్ ఇచ్చిన ధైర్యమేనా? కాదు కాదు... మథనపడుతున్నాన్నేను లోలోపలే.

అంటే... అంటే... ఇంకా సందిగ్ధమేనా...? ఇంకా... ఇంకా... ఆలోచనేనా?... ఆవేశపడకూడదనేనా?

మనిషి పగిలిపోవడమంటే ఇదే.

బిగించి కట్టిన మూటల్లో నుండి కారంచేడు, కలిచేడు, పెనుబర్తి నెత్తుటి నేలల్లో నుండి చచ్చిపోయిన భాగమేదో మనిషై పొడుచుకురావడమంటే యిదే... యిదే... రంగా

రెడ్డి కుటుంబం తొలినుండీ తమ కుటుంబానికి చేసిన అన్యాయాన్ని, పైకి కనపడని హింసని కూకటివేళ్ళతో సహా పెళ్ళగించడానికి ఆ కోడలి మాట ఒక చిన్న ఆయుధంలా దొరికినట్టయింది.

పరిగెడదాం... పరిగెడదాం... గెలిచేదాకా పరిగెడదాం...

తను గెలిచాడు... అవునవును తను గెలిచాడు...

తన వాళ్ళంతా ఈ నేల మీద నిలవడానికో పునాదిరాయి వేశాడు. ఈ మొత్తం చిన్నదో పెద్దదో విజయానికీ, తన ధైర్యానికీ మూలకారణం మాత్రం శామ్యూల్ అంకులే. అంకుల్ వెన్నుదన్నులు లేకుంటే తనీమాత్రం ముందుకురికేవాడు కాదు. ఏ మతంలో వుంటేనేం అసలీ అంటరానితనాన్ని... నన్ను ముట్టుకోకు నా మాలకాకీ అన్న వాదాన్ని అణగదొక్కాలన్నదే శామ్యూల్ చెప్పేదీ తను అడిగేది కూడా.

'అహ్హహ్హా...' అని నవ్వాలనిపించింది.

కృంగిపోయిన మనసుకి... ఇప్పటిదాకా చీకటి దుఃఖాల వెల్లువల్లో వున్న హృదయానికి కలిగిన ఊరటలో నుండి ఆనందమయ దుఃఖమేదో నన్ను కబళించినట్టుగా వుంది. విసిగి వేసారిపోయిన బాటసారికి పేదరాశిపెద్దమ్మ ఇల్లేదో కనబడి సేదతీరినట్లుగా అన్పిస్తోంది.

కళ్ళ నుండి ధారలుగా కారుతున్న నీటిని తుడుచుకుంటూ గోడకు తగిలించి వున్న డప్పుని తీసి అరిచేతులు బద్దలయ్యేట్ట వాయించడం మొదలుపెట్టాన్నేను.

అది ఉత్త డప్పు చప్పుడు కాదు.

చరిత్రనంతా ఎవరో తగలబెడుతున్నప్పుడు వినవచ్చే మహా ధ్వని.

ఆ శబ్దానికి ప్రభుత్వం కట్టించిన కాలనీ యిల్లు కుదుళ్ళతో సహా కదలడం మొదలైంది.

గోడకున్న అద్దంలో నాకు నేను శివతాండవం చేస్తోన్న ఆదిశివుడి అడుగుల్ని అధిగమిస్తున్న వాడిలా వున్నాను. అప్పుడెప్పుడో మలంకుక్కబడ్డ నా పెదవులు విచ్చుకుని మెరుస్తున్నాయి అద్దంలో.

అప్పటికి కాకులరొద కొంత తగ్గి మామిడిచెట్టు మీది కోయిల కమ్మగా కూయ సాగింది.

✦ ✦ ✦

*రంగారెడ్డి*

నా ముఖం మేఘాలు కమ్మిన నల్లమబ్బులా వుందేమో తెలియడంలేదు... అనవతమైవుంది.

కోడలి మాటని దిగమింగడం చాలా కష్టంగా వుంది.

కట్నకానుకలేమీ ఆశించకుండా ఇంటికి తెచ్చుకున్న కోడల్ని దేవతనుకున్నాను. అలాగే చూస్తూ వచ్చాను కూడా. అప్పుడప్పుడూ ఆమె ప్రవర్తన ఇబ్బంది పెడుతున్నప్పటికీ సర్దుకున్నాను. ముఖ్యంగా ఇంటి మనుషుల్లా వున్న పనివాళ్ళందరినీ లోపలికడుగు పెట్టకుండా చేసినప్పుడుకూడా ఆగ్రహాన్ని లోలోపలే అణుచుకున్నానే తప్ప పల్లెత్తి మాటనలేదు.

అటువంటిది ఆ అమ్మాయి చప్పున ఎంత మాటనేసింది.

'సొంత తండ్రే అయితే ఇలాటి తీర్పుకి తలవంచడు... పిల్లల్లేనోడికి కడుపుతీపేం తెలుస్తుంది,' అన్నది.

ఏనాడైనా మధుని నేను తమ్ముడి కొడుకులా చూశానా? నా కడుపున పుట్టాడనే గదా అనుకున్నాను.

పెద్దగా చదువుకోకపోయినా నాతోపాటు వ్యవసాయప్పనుల్లో, నాతోపాటు సంసారబాధ్యతల్లో, నాతోపాటు ఊరిమంచి చెడుల్లో తలలో నాలుకలా మెలుగుతూ వచ్చిన మధు... చిన్నరెడ్డి, చిన్నరెడ్డని ఊరంతటితోనూ పిలిపించుకునే మధు... మధు అంటే నాకెంత ప్రేమ, వాత్సల్యం... తమ్ముడు చెడు అలవాట్లు పట్టి, తాగి దుర్మరణం పాలయ్యాడని వీడిని చిన్నప్పట్నుండీ ఎంతో జాగ్రత్తతో సన్మార్గంలో నడిపించాన్నేను.

అటువంటి మధు నాలుగురోజులుగా నాతో మాట్లాడ్డం మానేశాడు. అంటే తన భార్య చేసిన పనిని సమర్థిస్తున్నాడా?

నాతోపాటు రాజకీయాల్లో భాగమైనవాడు... మతస్వరూపాన్నీ, కులాల కుమ్ములాటల్లోని లోపాలనీ బాగా ఎరిగినవాడు... మైలంటే మండిపడేవాడు... భార్యని మందలించాల్సిందిపోయి... నన్ను తప్పుపడుతున్నాడా...

కోడలు ఏమంటోంది.

తను మధుకు స్వంత తండ్రి కాదంటోంది. నిజమే, సొంత తండ్రినీ, సొంత మామనే అయ్యుంటే మైలని ఇంట్లో వేర్పాటు చేసిన రోజునే కోడల్ని ఖండించేవాడు. అలా ఖండించకపోవడం ఎంత తప్పయిందో యిప్పుడర్థమవుతోంది రంగారెడ్డికి.

సుధాకర్ని పట్టుకుని అంతమాటనడం కోడలి తప్పు కాదా?

తన కోడలేగదా అని గుడ్డిగా తను సమర్థించగలడా? అది న్యాయమవుతుందా?

ఊరు ఊరంతటికీ ఏళ్ళతరబడి తీర్పులు చేస్తూ వచ్చిన మనిషికి తన కోడలయ్యేసరికి అన్యాయం న్యాయమైపోతుందా?

కోడలు కూడ కొంత నోరు సంభాళించుకుంటే బావుండేది. కులం పేరెత్తి తిట్టడం తప్పేకదా. ఎవడి కులం వాడికి గొప్ప. సుధాకర్ మనసెంత బాధపడి వుంటుంది?

ప్రతి మనిషికీ వాడు ఎలాంటి వాడవనీగాక నలుపవనీ, తెలుపవనీ, పొట్టి అవనీ, పొడుగవనీ, సన్నమవనీ, లావవనీ, మంచివాడవనీ, చెడ్డవాడవనీ... వాడికో మనసుంటుందనీ, దానికి గాయమవుతుందనీ ఎందుకు గుర్తించరీ మనుషులు. చాలా చిన్న విషయం. అందరూ మనుషులేనన్న చిన్న స్పృహ వుంటే యింతింత దూరాలు నెట్టుకు రావేవీ...

అదంతా అలా వుంచితే తనూ కోడల్ని సమర్థించడానికే ప్రయత్నించాడు నిజానికి. మిగిలిన రెడ్లంతా కూడా సుధాకర్‌కి నచ్చచెప్పాలనే చూశారు. కావాలంటే ఊరంతా చందాలు వేసుకునైనా నువ్వడిగినంత డబ్బుకడ్తామని కూడా అన్నారు.

"మీ అమ్మమొగళ్ళారా యిది మీకు పుట్టిన సొంతబుద్ధి కాదురా. ఆ అమెరికా వాళ్ళొచ్చి మీ పక్కనచేరి మిమ్మల్నందరినీ క్రిష్టియన్లుగా మార్చడమే కాకుండా ఊరి రెడ్ల మీద ఎక్కబెడ్తుండారు. మనం మనం ఒకటిరా. పరాయిదేశం వాళ్ళమాట విని బతుకులు పాడుచేసుకోబాకండి... వాళ్ళేగన ఎల్లకాలం వుండి మీ బతుకుల్ని ఉద్ధరిస్తారా చెప్పండి," అంటూ సుబ్బారెడ్డి ఎంతగానో వప్పించాలని చూశాడు సుధాకర్ని.

అయినా వాళ్ళు వినేటట్టుగా వుండారా... సుధాకర్ని సమర్థిస్తూ చుట్టూ వంద మంది యువకులు... ఏదో పోరాటం జరుగుతున్నట్టుగా వుందక్కడ. నేను మామూలుగా తీర్పులిచ్చే పంచాయతీలాగా లేదు. ఏదో వుద్యమం చేస్తున్నట్టుగా వున్నారు వారంతా.

సుధాకర్ ఏమడిగాడు...? తనను కులంపేరుతో దూషించినందుకుగాను సుజాతమ్మ చేత్తోనే వండి మా వాళ్ళందరికీ స్వయంగా వడ్డించాలన్నాడు. అందుకు ఒప్పుకోనట్లయితే రెడ్లెవరితోనూ వాడకి సంబంధం వుండదనీ, వారి పంచాయతీలు, మధ్యస్థాలూ కూడా వాడ లెక్కచెయ్యదనీ అన్నాడు. అంతటితో ఆగకుండా కేసుపెట్టి కోర్టుకు వెళతానని కూడా అన్నాడు. కేసు పెడితే ఏంజరుగుతుందో రెడ్లందరికీ తెలుసు.

అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో, మరో గత్యంతరంలేక వాళ్ళ మాటని మన్నించాల్సి వచ్చింది.

అయినా ఇదేమంత ఘనకార్యమని... దీన్ని నేను పెద్ద శిక్షగా భావించలేదసలు. ఏదో ఒక్కపూట మనింట్లో ఏదైనా కార్యం చేసుకుంటున్నామనుకుని వాళ్ళందరికీ వంటలు చేసి వడ్డించేస్తే వాళ్ళకీ ఆనందంగా వుంటుంది, మనకీ తృప్తిగా వుంటుంది అనుకున్నాన్నేను. అందుకే ఆ తీర్పుని ఆమోదించి వచ్చాను.

కొడుకు, కోడలికి శత్రువైపోయాను.

కొడుకు మాట్లాడ్డం మానేశాడు. కోడలు సూటీపోటీ మాటలనేస్తోంది గౌరవం లేకుండా. ఊర్లో రెడ్లంతా కూడా నన్ను నేరస్తునిలా చూస్తున్నారు. జీవితంతో యుద్ధం చేస్తున్నట్లుగా వుంది నాకు. నా బుర్ర గిర్రున తిరిగిపోతోంది. ఈ రోజు ఏం జరగబోతోంది?

కోడలు వాళ్ళకు వండి వడ్డిస్తుందా...?

ఈ అవమానాన్ని భరించలేక, తన తప్పుని ఒప్పుకోలేక కోడలు మరేదైనా చేసుకుంటేనో... అమ్మో ఇంకేమైనా వుందా... వాళ్ళోళ్ళందరికీ నేనేమని జవాబు చెప్పాలి. మధు ముందు నేను తలెత్తుకోగలనా?... ఊరంతా తనని బహిష్కరించేయదా? ఏ దేవుడయినా అడ్డంపడి ఈ సమస్యని గట్టెక్కిస్తే బావుణ్ణు.

మనుషుల పట్ల ప్రేమా, దయా వుండి మంచీచెడ్డా తెలిసీ ఎన్నో ఏళ్ళుగా ఊరందరికీ న్యాయం చెబుతూ వచ్చిన నేను ఇవ్వాళ నా యింటి తప్పుకు మాత్రం తప్పించుకోవాలనుకోవడం న్యాయమౌతుందా...?

గుబగుబలాడుతున్న గుండెలతో కుర్చీకి అతుక్కుపోయి వున్నాన్నేను.

కాకుల రొద పూర్తిగా తగ్గేంతవరకు నేనట్లా ఆ కుర్చీలో కూలబడే వున్నాను.

✦ ✦ ✦

ఆ రాత్రి నా కంటిమీద రెప్పపడలేదు.

ఎంతకీ కరగని రాతిలాంటి రాత్రితో సహజీవనం జీవితమంత కష్టమైపోయింది నాకు. రాత్రంతా మేలుకొని ఎప్పుడు తెల్లారుతుందాని కిటికీలో నుండి చూస్తూనే వున్నాను.

ఆ వేళ... ఆ ఉదయం కాకులరొద వింతగా వుంది.

కోడి గొంతులో ఏదో మార్పు.

దిగ్గున లేచి కూర్చున్నాన్నేను.

నిన్న మాలాడంతటికీ భోజనాల కార్యక్రమం జరిగిన ఆ ఆరుబయలంతా చిమ్మి శుభ్రం చేస్తున్నట్టుంది రంగమ్మ. ఊడుస్తున్న శబ్దం విన్పిస్తోంది.

కోడలు లేచిన జాడేమీ లేదు. 'ఏమీ కాలేదు కదా,' అనుకుంటూ మెల్లిగా మంచం దిగి తడబడుతూ వరండాలోకొచ్చాను... భయంభయంగా చూపులు సారించాను.

ఇన్నాళ్ళూ నేను ఏదైతే జరగకూడదని అనుకుంటూ వచ్చానో, ఏదైతే జరిగిపోయిందేమోనని భయపడ్డానో అది నిజంగా జరగలేదు.

తీరా దుఃఖభయాన్నుండి తేరుకోవడం కష్టమైపోయింది నాకు. సర్వసాక్షి సాక్షీభూతంగా వాకిట్లోని చీకట్లనీ, కశ్మలాన్నీ కూడా బయటకి నెట్టేస్తోంది సుజాత... నోరు ఏదో గొణుక్కుంటూ వున్నప్పటికీ ఆమె ముఖం తుఫాను రాత్రి తెల్లవారిన ఆకాశంలా నిర్మలంగా వుంది.

ఇంట్లో మిగిలిపోయిన ఒకటి రెండు పిచుకలు కిచకిచ శబ్దం చేస్తూ నామీది నుండి అటువైపుకీ, ఇటువైపుకీ పచార్లు చేస్తూ వున్నాయి. నిజంగా విసుగ్గా లేకపోయినా

వాటిని చిరాగ్గా తరుముతున్నట్లు నటిస్తూ యాధాలాపంగా వచ్చినట్లు వరండాలో ఇంకొంచెం ముందుకొచ్చాన్నేను.

ఊరి చుట్టూ పచ్చగా ఎదిగిన పిచ్చితుమ్మ చెట్లమీది నుండి ఒక వింతైన పరిమళం తేలి ఊరిమీదికి వ్యాపిస్తోంది ఈ తెల్లవారురుఝామున.